సాక్షి సంగారెడ్డి

సోమవారం, 10, మార్చి, 2025



కలగానే 'ఆలు' పరిశోధన కేంద్రం

సంగారెడ్డి జిల్లాలో ఆలు పరిశోధనా కేంద్రం ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. వివరాలు 8లో ▸

మీ సేవ

కాసులిస్తేనే 'మీసేవ'

సులభతర పౌర సేవల కోసం ఏర్పాటుచేసిన మీ సేవ కేంద్రాల్లో చేతులు తడపందే పనులు కావడంలేదు. వివరాలు 9లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ సోమవారం సా. 6.30 గం.

సహర్ మంగళవారం ఉ. 5.06 గం.

నల్లపోచమ్మకు బోనమెత్తి..





జిల్లాలోని సుప్రసిద్ధ బోరంచ నల్లపోచమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. రెండు రోజులపాటు సెలవుదినాలు రావడంతో ఆదివారం ఆయా ప్రాంతాల నుంచి భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలతో మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ అర్చకులు సిద్దుస్వామి, నగేష్ స్వామి, ప్రవీణ్ స్వామి అమ్మవారికి పంచామృతాలు, గంగాజలంతో అభిషేకం, కుంకుమార్చన నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించారు. అదేవిధంగా గుమ్మడిదల మున్సిపాలిటీ అనంతారం గ్రామంలో నల్ల పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. – నారాయణఖేడ్/జిన్నారం (పటాన్‌చెరు)

మల్లన్నకు గంపలెత్తి..





తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో ఆదివారం మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో జాతర సందర్భంగా గంపల ఊరేగింపు నిర్వహించారు. అదేవిధంగా వెలిమెలలో శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సామూహిక గణపతి హోమం, శ్రీలక్ష్మి అనంత పద్మనాభ స్వామి హోమం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – రామచంద్రాపురం(పటాన్‌చెరు)

న్యూస్‌రీల్

విద్యార్థులు కష్టపడితేనే భవిష్యత్తు

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్ : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన శ్రీ వైష్ణవి స్కూల్ వార్షికోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీ పడే విధంగా విద్యార్థులను తయారు చేయాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులపై ఎన్నో ఆశలు పెట్టుకొని చదువుకోవడానికి పంపిస్తారని వారి ఆశలు నెరవేరే విధంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, వైష్ణవి, స్కూల్ చైర్మన్ విజయ్ ,మాజీ సీడీసీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, రామప్ప, జలంధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూతోనే కార్మికులకు న్యాయం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు టౌన్: కార్మికుల కష్ట సుఖాల్లో ఎర్రజెండా అండగా ఉంటుందని, సీఐటీయూ అంటేనే కార్మికులకు ఒక భరోసా అని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు, కిర్బీ యూనియన్ అధ్యక్షుడు చుక్కా రాములు పేర్కొన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు సీఐటీయూలో చుక్కా రాములు సమక్షంలో పెద్ద ఎత్తున చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...కార్మికులకు అండగా సీఐటీయూ ఉంటుందన్నారు. కిర్బీ పరిశ్రమలో కూడా కార్మికులకు అనేక చట్టపరమైన సౌకర్యాలు సీఐటీయూ సాధించిందని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు సాధిస్తామని భరోసానిచ్చారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.రాజయ్య, యూనియన్ నాయకులు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దారెడ్డి, రామకృష్ణకు ఎక్సలెన్సీ అవార్డు



అవార్డు అందుకుంటున్న సిద్దారెడ్డి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ వారి ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎక్సలెంట్ అవార్డు 2025కు జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, సదశివపేట మండలం నిజాంపూర్(కె) ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోట్రు రామకృష్ణ ఎంపికయ్యారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ మహిళా కో ఆపరేటివ్ చైర్ పర్సన్ బండారు శోభారాణి, దైవజ్ఞ శర్మ ఈ పురస్కారాలను వీరికి అందజేశారు. విద్యా, సామాజిక రంగాల్లో, మహిళా సాధికారిత అంశంలో విశేష కృషికిగాను ఈ పురస్కారాన్ని అందజేస్తున్నట్లు విజన్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ వ్యవస్థాపక చైర్మన్ భానుచందర్ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ వెన్నెల, వల్లూరి ఫౌండేషన్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

హద్దులు వేసి.. నిధులు మరిచి

ప్రతీ ఏడాది జిల్లాకు దక్కని కేటాయింపులు

- కొత్తగా రైల్వే లైన్ల కోసం జిల్లావాసుల ఎదురు చూపులు
- బోధన్–బీదర్, బోధన్–జోగిపేట లైన్లు సర్వేకే పరిమితం



కల్హేర్ మండలం మహదేవుపల్లి శివారులో నేషనల్ హైవేపై రైల్వే లైన్ కోసం ఏర్పాటు చేసిన హద్దులు

కల్హేర్(నారాయణఖేడ్): సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల ప్రజలు రైలు కూత కోసం ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. తమ ప్రాంతం మీదుగా కొత్త రైల్వే లైన్ల కోసం ఈసారైనా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందేమోనని ఎదురుచూస్తున్నారు. కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మాత్రం ఈ రైల్వే లైన్లకు నిధులు కేటాయించపోతుడటంతో ఈ జిల్లాల ప్రజలు ప్రతీసారి నిరాశే ఎదురవుతోంది. ప్రజారవాణా, అభివృద్ధికి రైల్వే సదుపాయం కీలకం కాగా...ప్రతీసారి కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. కొత్త రైల్వే లైన్ల ఏర్పాటు కోసం సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. ఇందుకోసం అవసరమైన నిధుల కేటాయింపుల్లో మాత్రం మోక్షం లభించడంలేదు.

13 ఏళ్లక్రితమే ప్రతిపాదనలు...

బోధన్–బీదర్, బోధన్–జోగిపేట్ కొత్త రైల్వే లైన్ల కోసం దాదాపు 13 ఏళ్ల క్రితం గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత జహీరాబాద్ ఎంపీ సురేశ్‌షెట్కార్ కృషి మేరకు ప్రతిపాదనలు పంపారు. అప్పట్లో బోధన్ నుంచి కామారెడ్డి జిల్లా బాన్స్‌వాడ, వడ్డెపల్లి, కల్హేర్ మండలం మహదేవుపల్లి, బాచేపల్లి, నారాయణఖేడ్ మీదుగా రైల్వే లైన్ కోసం సర్వే చేశారు. లైన్ కోసం హద్దులు ఏర్పాటు చేశారు. మరో రైల్వే లైన్ కోసం బోధన్ నుంచి బాన్స్‌వాడ, పిట్లం, కల్హేర్ మండలం బీబీపేట్, రాక్యల్, నారాయణఖేడ్ మీదుగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసిన ఏళ్ల తరబడిగా నిధుల కేటాయింపులు జరగలేదు. ఆరు నెలల క్రితం రెండు మార్గాల్లో తిరిగి సర్వే నిర్వహించారు. కొత్తగా హద్దులు ఏర్పాటు చేశారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధుల కేటాయింపు గురించి కేంద్ర ప్రభుత్వం ఊసేత్తలేదు. రైల్వే లైన్ల కోసం నిధులు దక్కకపోవడంతో ప్రజలు నిరాశ చెందారు.

కొత్త రైల్వే మార్గంతో అభివృద్ధి..

కొత్తగా రైల్వే మార్గం ఏర్పాటు జరిగితే ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల మీదుగా మహారాష్ట్రలోని దెగ్లూర్ వరకు సంగారెడ్డి–నాందేడ్ 161 నేషనల్ హైవే నిర్మించారు. జాతీయ రహదారి ఏర్పాటు కారణంగా రవాణా వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. హైవే ప్రాంతంలో ఉన్న భూముల విలువ పెరిగింది. ఏళ్ల తరబడిగా ఊరిస్తున్న రైల్వే లైన్ల ఏర్పాటు జరిగితే బాన్స్‌వాడ, నారాయణఖేడ్, జోగిపేట్ ప్రాంతాల్లో మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కొత్తగా రైల్వే లైన్‌ల ఏర్పాటు కోసం ఎంపీ సురేశ్‌షెట్కార్ మరింత కృషి చేయాలని కోరుతున్నారు.

రైల్వే లైన్ వస్తే అభివృద్ధి



బోధన్ నుంచి కొత్తగా రైల్వే లైన్ ఏర్పాటు ప్రతిపాదనలు సర్వేకే పరిమితమైంది. ఏళ్ల తరబడిగా ఎదురుచూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయలేదు. సర్వే చేసి నిధుల మంజూరుపై ఆశలు ఊరిస్తున్నారు. రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే ప్రజారవాణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. వివక్ష చూపకుండా కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలి.

: బాలయ్య, మహదేవుపల్లి, కల్హేర్ మండలం

కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం



రైల్వే లైన్ల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. బోధన్–బీదర్, బోధన్–జోగిపేట్ మీదుగా హైదరాబాద్ వరకు రైల్వే లైన్ ఏర్పాటు కోసం నిరంతరం కృషి చేస్తాం. గతంలో ఎంపీగా తాను కృషి చేయడంతో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో తోటి ఎంపీలతో కలసి రైల్వే లైన్ సాధన కోసం పనిచేస్తాం. ప్రజల ఆశలు నెరవేర్చేందుకు ఎల్లప్పుడు శ్రమిస్తా.

సురేశ్ షెట్కార్, ఎంపీ, జహీరాబాద్

విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యం

ఎమ్మెల్యే సంజీవరెడ్డి



శ్రీనివాస్‌రావుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: తమ ప్రభుత్వంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్పష్టం చేశారు. సిర్గాపూర్ మండలం సంగం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రావుకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60 వేలు మంజూరుకాగా అందుకు సంబంధించిన చెక్కును ఆదివారం ఆయన ఖేడ్‌లోని తననివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...వైద్యరంగానికి ప్రాధాన్యతలో భాగంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచిందన్నారు. కాగా, మనూరు మండలం దన్వార్ గ్రామంలో నిర్వహించిన బీరప్ప జాతర మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. జాతర ఉత్సవాల్లో పాల్గొన్న సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, మాజీ సర్పంచ్ దిగంబర్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- రోడ్డున పడ్డ 14 కుటుంబాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుల విజ్ఞప్తి

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని రెవెన్యూ కాలనీలో శనివారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఏకంగా 14 గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మునిపల్లి మండలం కంకోల్‌కు చెందిన గుజ్జుల జెట్టయ్య గత 12 ఏళ్లుగా రెవెన్యూ కాలనీలోని రాజీవ్‌గృహకల్ప బిల్డింగ్ ఆవరణలో గుడిసె వేసుకుని జీవిస్తున్నారు. ఇతని నివాసం పక్కనే 13 కుటుంబాలు కూడా గుడిసెలు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నాయి. సంగారెడ్డి మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఇంటి నుంచి చెత్తను సేకరించడం వృత్తి. ఈ నెల 8న శనివారం నాడు కంకోల్ ఉండే తమ బంధువుల ఇంటివద్ద జరిగిన ఓ శుభకార్యానికి అందరూ కలసి వెళ్లారు. అదేరోజు రాత్రి పది గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల ఓ గుడిసెల్లో మంటలు చెలరేగాయి. ఈ మంటలు మిగతా గుడిసెలకు కూడా అంటుకోవడంతో మొత్తం 14 గుడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖకు సమాచారమందించగా...వెంటనే ఘటనాస్థలికి చేరుకుని ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే గుడిసెలు పూర్తిగా కాలిపోవడంతో 14 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ అగ్నిప్రమాదంలో అదృష్టవశాత్తూ ప్రాణం నష్టమేమీ సంభవించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుజ్జుల జెట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

సుందరంగా తీర్చిదిద్దుతాం

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



మల్లన్న సన్నిధిలో మంత్రి పొన్నం కుటుంబ సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్నస్వామి క్షేత్రాన్ని అన్ని విధాల సుందరంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లికార్జున స్వామి మా కుటుంబానికి ఇలవేల్పు అని, ప్రతి సంవత్సరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ కట్టుబడి ఉందని, భక్తులకు కావల్సిన సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు కావాలనే బద్నాం చేస్తున్నాయని పొన్నం అన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహాదేవుని శ్రీనివాస్, ,దర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, జయప్రకాశ్ రెడ్డి, తురాయి నవీన్ పాల్గొన్నారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నిదానం

బ్రిడ్జిల వద్ద కూలిన గోడలు

- రోడ్డుకిరువైపులా పిచ్చిగడ్డి
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- అధికారుల ఆదేశాలు బేఖాతరు
- ఏళ్లు గడుస్తున్నా అదే తీరు



వంగిపోయిన సూచిక బోర్డు



సంగం(కె) గ్రామ శివారులో బ్రిడ్జి వద్ద కోతకు గురయిన రోడ్డు

ఝరాసంగం(జహీరాబాద్): అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణలోపంతో ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారుల నిర్వహణ అధ్వానంగా మారింది. మరమ్మతులు చేపట్టి రహదారుల నిర్వహణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినా క్షేత్రస్థాయిలో మండల అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. ఫలితంగా తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో పలువురు మృత్యువాత పడటంతోపాటు మరికొందరు గాయాల పాలవుతున్నారు. జహీరాబాద్ పట్టణానికి నిత్యం వేలాదిమంది అందోల్ నియోజకవర్గంలోని పలు మండలాలతో ఝరాసంగం మండల ప్రజలు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు.

బ్రిడ్జిల వద్ద కోతలు, కనిపించని సూచిక బోర్డులు

జహీరాబాద్ నియోజకవర్గం పస్తాపూర్ నుంచి ఝరాసంగం మండల పరిధిలోని కప్పాడ్ వరకు సుమారు 20 వరకు బ్రిడ్జిలు ఉంటాయి. కొన్నిచోట్ల బ్రిడ్జి గోడలు కూలిపోయి ఉన్నాయి. మరికొన్నిచోట్ల కోతకు గురయ్యి ప్రమాదకరంగా మారాయి. చాలాచోట్ల బ్రిడ్జిల చుట్టూ పిచ్చి మొక్కలు నిలిచి సూచిక బోర్డులు కనిపించడం లేదు. మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారాయి. మరమ్మతులు చేపట్టాలని ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి తప్ప కార్యాచరణకు నోచుకోవడంలేదు. ఇక రోడ్లకిరువైపులా ఏపుగా పెరిగిన చెట్లవల్ల రాత్రి సమయాల్లో ఎదురుగా వచ్చే వాహనాలు సరిగ్గా కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అంతేకాకుండా మూలమలుపుల వద్ద ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు నేలకు ఒరిగి దారిని చూపలేకపోతున్నాయి.

స్థానికులు ఆగ్రహం...

ప్రతి సంవత్సరం ఝరాసంగం శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు జరుగుతాయి. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తుంటారు. ఆలయానికి వచ్చే దారులు మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినా బేఖాతరు చేశారని, కనీసం ఒక్క పని కూడా చేపట్టలేకపోయారని అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని, రహదారుల నిర్వహణ చేపట్టాలని కోరుతున్నారు.

నిర్వహణను గాలికొదిలిన అధికారులు

ప్రధాన రహదారులతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్ల నిర్వహణ కూడా అధ్వానంగా మారింది. పిచ్చి మొక్కలను తొలగించాలని పలువురు కోరుతున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

క్లుప్తంగా

నేడు టెంకాయల వేలంపాట

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ టెంకాయల దుకాణం వేలంపాటను సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శివరుద్రప్ప ఒక ప్రకటనలో ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉ.11.30 గంటలకు వేలం పాట ప్రారంభమవుతుందన్నారు. వేలంపాటలో రూ.10 వేలను దరావత్తు చెల్లించిన వారు మాత్రమే పాల్గొనాల్సి ఉంటుందన్నారు. టెంకాయల దుకాణం రెండు సంవత్సరాలు నిర్వహణకు పాట ఉంటుందన్నారు.

నార్సింగిలో గ్యాస్ లీకై అగ్నిప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగిన సంఘటన నార్సింగి మండల కేంద్రంలో చోటు చేసుంది. ఆదివారం నార్సింగి మండల కేంద్రానికి చెందిన మైలారం సిద్ధిరాములు నివాస గృహంలో ఉదయం వంట నిర్వహణకు గ్యాస్ సిలిండర్ ఆన్‌చేసి ముట్టించగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కుటుంబ సభ్యులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా, అగ్నిప్రమాదానికి గురయ్యారు. దీంతో ఇంటి బయటకు పరుగున రాగా, ఇరుగుపొరుగు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న రామాయంపేట అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలు ఆర్పారు. ఈ సంఘటనలో సిద్ధిరాములు, యశోద, ఎల్లమ్మ, నరేశ్ అగ్నిప్రమాదంలో గాయపడగా, స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ సంఘటనలో ఇంట్లోని సామగ్రి కాలిపోవడంతో పాటు ఇల్లు పైకప్పు దెబ్బతిన్నది. సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

బ్యాంకులో చోరీకి విఫలయత్నం


ధ్వంసమైన బ్యాంకు భవనం కిటికీ

శివ్వంపేట(నర్సాపూర్): మద్యం మత్తులో బ్యాంకులో చోరీకి పాల్పడుతుండగా గుర్తించిన స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. శనివారం అర్ధరాత్రి మండల పరిధి దొంతి గ్రామ పరిధిలోని తూప్రాన్‌- నర్సాపూర్ హైవే పక్కన ఉన్న యూనియన్ బ్యాంకులో నలుగురు మద్యం మత్తులో బ్యాంకు లోనికి వెళ్లేందుకు కిటికీ వద్ద తవ్వకాలు చేస్తుండగా స్థానికులు గుర్తించారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా ముగ్గురు పారిపోగా ఒకడు చిక్కాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బ్యాంకు వద్దకు చేరుకున్నారు. మండల పరిధిలోని రెడ్యా తండాకు చెందిన ధన్‌రాజ్‌ని అదుపులోకి విచారించగా మిగితా ముగ్గురు పేర్లు చెప్పాడు. దొంతికి చెందిన కటిక బాలేష్, చండీకి చెందిన ఎంచర్ల పోచయ్య, నల్లూరి శ్రీశైలంను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ కునాల్ గౌతమ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


మహేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): మతి స్థిమితంలేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని అల్వాలలో చోటు చేసుకుంది. ఎస్ఐ బోయిని పరశురాములు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పుల్ల లచ్చవ్వ, యాదయ్యల కొడుకు మహేశ్‌కు మతిస్థిమితం సరిగా ఉండదు. ఈ క్రమంలో 4వ తేదీ రాత్రి అతడు మూత్ర విసర్జనకని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మహేశ్ తల్లి ఆదివారం ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోనేరులో మునిగి వ్యక్తి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రమాదవశాత్తు కోనేరులో మునిగి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతరకు ఆదివారం హైదరాబాదు తిరుమలగిరి జవహర్‌లాల్ నగర్ చెందిన కుటుంబం వచ్చారు. చిత్తడి కర్ణాకర్(14) తన మేనమామ శివకుమార్‌తో కలిసి కోనేరులో స్నానం చేసేందుకు దిగారు. స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాస్తు కర్ణాకర్ కొనేరులో పడ్డాడు. గుర్తించిన మేనమామ అరవడంతో గట్టుపైనున్న పలువురు కోనేరులో నుంచి అతన్ని బయటకు తీసుకొచ్చారు. కొనఊపిరితో ఉన్న అతన్ని 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కలగానే ఆలు పరిశోధన కేంద్రం

- సంగారెడ్డిలో ఏర్పాటు చేయాలని దశాబ్దం క్రితం ప్రతిపాదన
- రూ.1.57 కోట్లతో అంచనాలు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో ప్రతిపాదనలు బుట్టదాఖలు
- విత్తనం కోసం పక్క రాష్ట్రాలకు రైతుల పరుగు
- అధిక శాతం దళారులపైనే ఆధారం
- నాసిరకం విత్తనంతో నష్టాల్లో కూరుకుపోతున్న రైతాంగం


చేతికి అందివచ్చిన ఆలుగడ్డ పంటను తీస్తున్న రైతు, కూలీలు

జహీరాబాద్: సంగారెడ్డి జిల్లాలో బంగాళదుంప(ఆలుగడ్డ) పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని దశాబ్ద కాలం క్రితం ప్రతిపాదించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 2012–13 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని సంగారెడ్డిలో డాక్టర్ వై.ఎస్.ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రానికి అనుబంధంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి బంగాళ దుంప పరిశోధనా కేంద్రం అప్పటి మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం పరిశీలించింది. సైంటిస్టులు సైతం అన్ని ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలో ప్రస్తుతం ఒక్క తమిళనాడు రాష్ట్రంలోనే ఆలుగడ్డ పరిశోధన కేంద్రం ఉంది. సంగారెడ్డిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే తెలుగు రాష్ట్రాల్లోనే ఇది మొదటి కేంద్రం అవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఆలుగడ్డ పంటను సాగుచేస్తుంటారు. ప్రతి సీజన్‌లో ఆలుగడ్డ పంటను సాగుచేసే ముందు రైతులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా, పంజాబ్‌లోని జలంధర్‌లతో పాటు గుజరాత్ రాష్ట్రాల నుంచి విత్తనం తెచ్చుకోవాల్సి వస్తోంది. తద్వారా రైతులపై ఆర్థిక భారం పడుతోంది. దీనికి తోడు తమ ప్రాంతంలోని వాతావరణ పరిస్థితులకు అనువైన బంగాళదుంప రకాలు లభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఆలుగడ్డ సాగు చేసే రైతులకు ప్రయోజనకరంగా ఉండేందుకు ఆల్ ఇండియా కో–ఆర్డినేటెడ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రాజెక్టు(ఆక్రిప్) ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రానికి అనుబంధంగా ఆలు పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అప్పట్లో ప్రతిపాదించారు. ఇందుకు రూ.1.57 కోట్లతో సంగారెడ్డిలో ఆలు పరిశోధన కేంద్రానికి సంబంధించి ఆక్రిప్ సిమ్లాలో ఉన్న సెంట్రల్ పొటాటో రిసెర్చ్(సీపీఆర్ఐ)కు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు సిమ్లాలోని సీపీఆర్ఐ ఆమోదం తెలిపేందుకు సంసిద్ధతను సైతం వ్యక్తం చేసింది. దీంతో సంగారెడ్డిలోని వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం సైంటిస్టులు ఏడు రకాల బంగాళ దుంపలపై పరిశోధనలు చేసేందుకు సిద్ధపడ్డారు. మీరట్, లక్నో, ఆగ్రా నుంచి కుఫ్రీ పక్‌రాజ్ (కె166), కుఫ్రీ చంద్రముఖి, కుఫ్రీ బాద్‌షా, కుఫ్రీ జ్యోతి, కుఫ్రీ చిప్‌సోనా1, కుఫ్రీ చిప్‌సోనా–3 రకం బంగాళదుంపల సీడ్స్‌ను తెప్పించేందుకు అప్పట్లో అన్ని ఏర్పాట్లు జరిగాయి. అయినా రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా పరిశోధనా కేంద్రం అంశం మరుగున పడింది. ఆ తర్వాత ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా ఈ అంశం పరిశీలనకు రాలేదు. పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే రాష్ట్రంలోని రైతులకు స్థానికంగా మేలైన ఆలు విత్తనం లభించడంతో పాటు అధిక దిగుబడులనిచ్చే విత్తనం తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయి.

నాసిరకం విత్తనంతో నష్టాలు

రైతులు ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చుకుంటున్న ఆలుగడ్డ విత్తనం నాసిరకంగా ఉండడంతో పంట దిగుబడులు రాకపోవడం, తెగుళ్ల బారిన పడడం వల్ల నష్టాలను చవిచూస్తున్నారు. ఆయా రాష్ట్రాలకు రైతులు నేరుగా వెళ్లి తెచ్చుకోవడం కష్టతరంగా ఉండడంతో స్థానికంగా దళారులు విక్రయించే విత్తనమే కొనుగోలు చేసుకోక తప్పడం లేదు. విత్తనం ధర ఆకాశాన్నంటడం, చేతికి వచ్చిన పంటను విక్రయించేందుకు వెళితే ధర రాక పోవడం రైతులు నష్టాల బారిన పడుతున్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలోనే అత్యధికంగా సాగు

మూడు నెలల పంట కావడంతో రైతులు ఆలుగడ్డ పంట సాగువైపు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోనే ఈ పంట సాగవుతోంది. సుమారు 8వేల ఎకరాల్లో సాగుచేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాను పరిగణలోకి తీసుకుంటే ఒక్క జహీరాబాద్ ప్రాంతంలోనే 80 శాతం మేర పంటను రైతులు సాగు చేసుకుంటున్నారు. సంగారెడ్డిలో పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలతో పాటు పక్కనే ఉన్న వికారాబాద్ జిల్లాకు చెందిన రైతాంగానికి ఎంతో సౌలభ్యం అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆలు పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.


జహీరాబాద్ ప్రాంతంలో ఆలుగడ్డ పంట(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వ్యాపారవేత్త మృతి

సంతాపం తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావు


గట్టు రవీందర్ (ఫైల్)

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో ప్రముఖ వ్యాపారవేత్త మృతి చెందిన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణం పారుపల్లి వీధికి చెందిన వ్యాపారవేత్త గట్టు రవీందర్ (61) తన భార్య అరుణతో కలిసి శనివారం రాత్రి రంగీలా దాబా వద్ద ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి వెళ్లారు. ద్విచక్ర వాహనంపై భార్యతో కలిసి తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో కేసీఆర్ నగర్‌కు చెందిన ఓంప్రకాశ్ తన ద్విచక్ర వాహనంపై రాంగ్ రూట్‌లో వస్తూ ఎదురుగా వస్తున్న రవీందర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవీందర్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య అరుణకు స్వల్ప గాయాలయ్యాయి. ఓం ప్రకాశ్‌కు కూడా గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రవీందర్ మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆర్య వైశ్య భవన్ అధ్యక్షుడిగా పనిచేశారని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

చెట్టును ఢీకొన్న కారు..

దంపతులకు తీవ్ర గాయాలు


రాజీవ్ రహదారి పక్కన చెట్టును ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈఘటన కొండపాక గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని సనత్‌నగర్ నుంచి సందీప్, అనిలా దంపతులు కారులో జగిత్యాల జిల్లా ధర్మపురిలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్తున్నారు. ఈక్రమంలో కొండపాక శివారులోకి రాగానే కారు అదుపు తప్పి రాజీవ్ రహదారి పక్కన ఉన్న చెట్టును బలంగా ఢీకొట్టింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతిన్నది, సమాచారం తెలుసుకున్న 108 అంబులెన్సు సిబ్బంది క్షతగాత్రులను సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కూతురును చూసేందుకు అత్తారింటికి వెళ్తుండగా..

- బైక్, ఆటో ఢీ.. యువకుడి మృతి
- ఆకారం గ్రామ శివారులో ఘటన


ఎర్రోళ్ల నరేశ్ (ఫైల్)

దుబ్బాకరూరల్: కూతురు పుట్టిందన్న సంతోషంలో అత్తారింటికి బయలు దేరిన యువకుడికి వేగంగా దూసుకువచ్చిన ఆటో మృత్యుపాశమైంది. బిడ్డ వద్దకు చేరకుండానే ఆ యువకుడిని రోడ్డు ప్రమాదం కబళించింది. దీంతో ఆ కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది. ఈ ఘటన మండల పరిధిలోని ఆకారం గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోతారం గ్రామానికి చెందిన ఎర్రోళ్ల నరేష్ (28)కు నెల రోజుల క్రితం కూతురు పుటింది. తన భార్య పుట్టింట్లోనే ఉంది. తన భార్యను కూతురును తీసుకురావడానికి తన అత్తగారి ఊరైన కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం మల్కాపూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆకారం గ్రామ శివారులోకి రాగానే అతి వేగంగా దూసుకు వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో తలకు తీవ్రంగా గాయాలు కావడంతో నరేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మేడ్చల్‌లో అదృశ్యమై.. వడియారంలో శవమై..


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటరాజాగౌడ్

చేగుంట(తూప్రాన్): మేడ్చల్‌లో అదృశ్యమైన వ్యక్తి వడియారం శివారులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూపీకి చెందిన లాల్ బహద్దూర్ (49) మేడ్చల్‌లో స్వీట్ తయారీ కేంద్రంలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం కనిపించకుండా పోయాడు. ఈనెల 4వ తేదీన అక్కడి పోలీసులకు బంధువుల ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి వడియారం శివారులోని బైపాస్ సమీపంలో వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. మృతుడు మేడ్చల్‌లో అదృశ్యమైన లాల్‌బహద్దూర్‌గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య


మహేశ్వరి మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): కడుపునొప్పి భరించలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఈసంఘటన మండలంలోని మహమ్మద్‌నగర్‌లో ఆదివారం జరిగింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం మర్వెల్లికి చెందిన మహేశ్వరి(27)ని మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన ఎదుల అనిల్‌కుమార్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం పెళ్లి చేశారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. కొన్ని నెలలుగా ఆమె కడుపునొప్పితో బాధపడుతుంది. పలుమార్లు చికిత్స చేయించుకున్న తగ్గలేదు. దీంతో ఆదివారం భర్త, మామ పొలం పనులకు వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న మహేశ్వరి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అదే సమయంలో భర్త ఇంటికి రాగా తలుపులు పెట్టి ఉన్నాయి. పిలిచినా పలకకపోవడంతో తలుపులు తొలగించి చూడగా భార్య విగతజీవిగా కనిపించింది. 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి నాగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

చికిత్సపొందుతూ మృతి


వెంకటేశం (ఫైల్)

వర్గల్(గజ్వేల్): కూతురు పెళ్లి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ మనోవేదనతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం వర్గల్ మండలం సీతారాంపల్లిలో జరిగింది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపల్లికి చెందిన ఆటోడ్రైవర్ తూప్రాన్ వెంకటేశం (42)కు భార్య మంజుల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంవత్సరం క్రితం పెద్ద కూతురు పూజ పెండ్లికి రూ. 2 లక్షల వరకు అప్పుచేశాడు. అప్పు ఎలా తీర్చాలంటూ తరచూ బాధపడేవాడు. అదే వేదనతో ఆదివారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే అతనిని కుటుంబీకులు గజ్వే ల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి


కొమురవ్వ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): భర్త మరణం తట్టుకోలేక భార్య మృతిచెందిన సంఘటన మండలంలోని కర్నాల్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చింతాకుల అయ్యేల్ల (65) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. భర్త మృతిని తట్టుకోలేక మనోవేదనకు గురైన భార్య కొమురవ్వ (60) ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. భర్త మృతి చెందిన మూడు రోజులకే భార్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

దైవ నామస్మరణతో ముక్తిమార్గం


పూజలు నిర్వహిస్తున్న స్వామిజీ

హత్నూర(సంగారెడ్డి): దైవ నామస్మరణతో ముక్తి సులభంగా పొందవచ్చని మాధవానంద సరస్వతి స్వామిజీ అన్నారు. ఆదివారం హత్నూరలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని స్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యంత్ర ప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠ నవగ్రహ ప్రతిష్ఠ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతనతో ఉండాలన్నారు. రామనామం తారక మంత్రం ప్రతి ఒక్కరిని కాపాడుతుందన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

గజ్వేల్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని రిమ్మనగూడ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన రతన్ రిషిదేవ్(42) హైదరాబాద్‌లోని సుల్తానాబాద్ ప్రాంతంలో హామాలీగా పని చేస్తున్నాడు. సిద్దిపేటలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని పనిచేసే వారికి చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున ప్రజ్ఞాపూర్ నుంచి రిమ్మనగూడ వైపు రింగురోడ్డు దాటిన తర్వాత నడుచుకుంటూ వెళ్తున్న అతడిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రిషిదేవ్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

క్షణికావేశం.. తీసింది ప్రాణం


రమేశ్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): క్షణికావేశం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. ఈ సంఘటన మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం చేగుంటకు చెందిన దొడ్ల రమేశ్ (35) ఇంటి నిర్మాణం కోసం రామాయంపేటలోని ఓ బ్యాంకులో రుణం తీసుకున్నాడు. రుణం కట్టాల్సిన సమయం రావడంతో ఒత్తిడి పెరిగింది. దీనికి తోడూ కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన రమేశ్ ఆదివారం సాయంత్రం మద్యం సేవించి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని వెళ్లాడు. ఈక్రమంలో వడియారం వెంచర్ సమీపంలోని రైలు పట్టాల వద్ద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. కుటుంబసభ్యులు మెదక్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పట్టాల సమీపంలో పడిపోయినందున రైల్వే పోలీసుల పరిధిలోకి వస్తుందని స్థానిక పోలీసులు తెలిపారు. ఫిర్యాదు రాకపోవడండంతో ఇంకా కేసు నమోదు చేయలేదని కామారెడ్డి రైల్వే పోలీసులు తెలిపారు.

టికెట్ లేకుండానే వీవీఐపీ దర్శనం

పట్టుబడిన వలంటీర్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో తాత్కలిక పద్ధతిలో పనిచేస్తున్న ఓ వలంటీర్ భక్తుల నుంచి ఫోన్‌పే యాప్‌లో డబ్బులు పొంది టికెట్ ఇవ్వకుండా రూ.500 విలువగల వీవీఐపీ క్యూలైన్ గుండా దర్శనానికి పంపించి పట్టుబడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కొమురవెల్లి మల్లికార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఓ వాలంటీర్ పలువురి భక్తుల నుంచి ఫోన్‌పే ద్వారా రూ.1000 పొంది టికెట్ ఇవ్వకుండా వీవీఐపీ క్యూలైన్ గుండా తనకు తెలిసిన వ్యక్తులని ఆలయ వర్గాలకు సూచించి క్యూలైన్లో పంపించాడు. కాసేపటికి అనుమానం కలిగిన ఆలయ వర్గాలు భక్తులను పిలిచి ఆరా తీయగా వాలంటీర్ ఎవరో తమకు తెలియదని, డబ్బులిస్తేనే దర్శనానికి పంపిస్తామని చెప్పడంతో ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. దీంతో వీవీఐపీ కౌంటర్ దగ్గర ఉన్న ఆలయ వర్గాలు భక్తులు చెప్పిన వివరాలు రికార్డు చేసి వాలంటీర్‌ను మందలించారు. కానీ విషయాన్ని గోప్యంగా ఉంచడంతో ఆలయ వర్గాలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత యేడాది పాస్‌లు అమ్మిన్న వాలంటీర్‌పై కేసులు నమోదు చేసి, ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనపై ఆలయ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై ఆలయ ఈఓ రామాంజనేయులును వివరణ కోరగా వాలంటీర్ చేతివాటం ప్రదర్శించిన విషయమై గ్రామానికి చెందిన శివాజీ యూత్ అసోసియేషన్ సభ్యులు తెలిపారని, సోమవారం విచారించి వాలంటీర్‌ను తొలగించేందకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


యజ్ఞం నిర్వహిస్తూ...

మర్కూక్(గజ్వేల్): ఆలయాల అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాములపర్తి గ్రామంలో ఆదివారం రాములోరి కళ్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీతారామాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. అంతకు ముందు ఆలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సీతారామచంద్రమూర్తుల కల్యాణ మహోత్సవం భక్తజనావళికి నేత్రపర్వం చేసింది. యజ్ఞం పూర్ణాహుతి అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు హన్మంతరావు దంపతులతో కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం పల్లకిసేవ, కోలాటం కార్యాక్రమాలు కొనసాగాయి.

నేడు రథోత్సవం

ఆలయం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 11 గంటలకు శ్రీరామ పట్టాభిషేకం, అనంతరం ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ నిర్వాహకుడు తెలిపారు.

3,500 నాటు కోళ్లు మృతి

నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో ఘటన


అంతుచిక్కని వ్యాధితో మృతి చెందిన నాటు కోళ్లు

నర్సాపూర్ రూరల్: అంతుచిక్కని వ్యాధితో నాటు కోళ్ల మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్‌లో చోటు చేసుకుంది. లింగాపూర్ తండాకు చెందిన పాతులోత్ ప్రసాద్‌కు చెందిన 3,500 నాటు కోళ్లు అంతు చిక్కని వ్యాధితో మృత్యువాత పడ్డాయి. కొన్ని రోజులుగా నాటు కోళ్ల పెంపకంతో ఉపాధి పొందుతున్న ప్రసాద్ తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. అప్పులు చేసి రూ. 8 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నాటు కోళ్లను పెంచుతున్నట్లు బాధితుడు తెలిపాడు. ఇటీవల నా షెడ్డు దగ్గరలో ఉన్న బాయిలర్ పౌల్ట్రీ షెడ్డులో కోళ్లు చనిపోయాయని, అదే వ్యాధి నాటు కోళ్లకు వ్యాపించి చనిపోయని ఆరోపించాడు. ప్రైవేట్ బాయిలర్ కోళ్ల కంపెనీ, లేదా ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరుతున్నాడు. ఈ విషయమై పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి సౌమిత్‌ను వివరణ కోరగా.. అతి ఉష్ణోగ్రత కారణంగా కోళ్లు చనిపోయి ఉంటాయని, లేదా ఇంకా ఏదైనా వ్యాధితో మృతి చెంది ఉంటాయన్నారు. బర్డ్‌ఫ్లూ అని మాత్రం నిర్ధారించలేమన్నారు. మృతి చెందిన కోళ్లను ల్యాబ్‌కు పంపుదామంటే బాధితుడు కోళ్లను గోతిలో పాతి పెట్టడంతో ల్యాబ్‌కు పంపలేకపోయినట్లు చెప్పారు. పౌల్ట్రీ షెడ్డులు నిర్వహించే రైతులు కోళ్లకు ఏదైనా సమస్య వచ్చినట్లయితే వెంటనే పశుసంవర్ధక శాఖ వైద్య అధికారులను సంప్రదించాలని సూచించారు.